
"ఇది ఒక కథే," "కథకాని కథ" "జరగని కథ" చూసాక నా కథకు "నా కథ" అని పేరు పెట్టాను. నా కథ అంటే నా— కథ కాదు. నా కథ తాలూకు కథ.

# నా కథ

*ఎ.వి.కె



సరే, కథ రాద్దాం అనుకొన్నాను. వెనకటి కెవరో, ఒకాయన ఏ పనిచేసినా లాజిక్ ఉండా లని అన్నాడట. కథ రాయడానికి ఏం కావాలి ? అనుకొన్నాను. ఆదిలోనే హంసపాదు అన్నట్టు, వెంటనే బుర్ర పనిచెయ్యనని సమ్మె కట్టింది. అదరా, బాదరాగా కథలు రాసి ప్రచురించని (ప్రచురించనిది అతను కాదు— సంపాదకుడు) ఓ మిత్రుడి దగ్గరకు వెళ్ళాను వినయంగా నిల్చొని, వచ్చిన పని చెప్పాను.

నాతల నించి కాలిగోరుదాకా ఎగా దిగా చూశాడు. అతనితో పాటే నేను కూడా తల ఎత్తి, దించాను.

"కదలకుండా, నిల్చో ! నేను అడిగిన ప్రశ్న లకి జవాబియ్యి" అన్నాడు.

"అలాగే" అన్నాను.

రెండు నిముషాలు నిశ్శబ్దంగా నిల్చున్నాడు. ఉన్నట్టుండి పెర్రీమేసన్ లాగ కుడిచెయ్యి చూపుడు వేలు నావేపు చాచి గర్జించాడు.

"సిగరెట్ కాలుస్తావా ?" అని.

లేదన్నాను.

"వక్కపొడి అలవాటుందా ?"

"ఊహూ !"

"నాలుగు కప్పుల కాఫీ ఒక్కసారి తాగ గలవా ?"

"అబ్బే !"

"అయితే పో, పారిపో, సిగరెట్లు కాల్చలేని వాడు వక్కపొడి నమలలేనివాడు, కాఫీ తాగలేని వాడు, రచయిత అవడు. నేను నిన్ను రచయితగా తయారు చేసినా, భగవంతుడు వూరుకోడు. వూరుకోడు" అన్నాడు సినిమా డైలాగులు వేస్తూ.

విచారంగా ఇంటి కొచ్చాను. నాకు కథలు రాసే యోగ్యత లేదన్నమాట. ఎలాగ అని ఆలోచించాను. మెరుపులాంటి ఆలోచన తట్టింది. ఆపూటనే బజారుకు పరిగెత్తి దస్తా కాగితాలు, సెకెండ్‌హాండ్ బుక్‌షాపులో ప్రఖ్యాత రచయితల పాత రచనలు పట్టుకొని వచ్చాను. ఆ పుస్తకాలు అన్నీ చదివాను. అన్నీ రకరకాలుగా ఉన్నాయి. పోనీ, ఒకే లాగ ఉంటే ఆ కిటుకు లేవిటో తెలుసుకో వచ్చనుకున్న నా ఆశ నిరాశ అయింది. మరో ఆలోచన తట్టింది. అదే "కథ చౌర్యం". అప్పట్లో ఆమాట నాకు అర్థం లేనిదిగా కన్పించింది. ఎందుకంటే నేను చదివే ప్రతి పుస్తకం లోనూ "ఫలానా వారు మార్గదర్శకులు. వారికి కృతజ్ఞత" అని ఉండేది. నా కథకి కూడా అలాటిది రాద్దామనుకున్నాను.

వెంటనే నాకు వచ్చిన భాగాలు ప్రతి పుస్తకం లోంచి, తీసి రాశాను. (అయితే పాత్రల పేర్లు మార్చాను). ఆ కొన్ని దస్తా కాగితాలు పూర్తయ్యాయి. కథ పూర్తయింది. దాన్ని "పెద్ద కథ" అనాలా, 'నవల' అనాలా అన్న సమస్య పట్టుకుంది. చివరికి ఆ బాధ్యత సంపాదకుడిదే అని వదిలేశాను.

మిత్రు లందరికీ చదివి వినిపించాను.

"బ్రహ్మాండంగా ఉందోయ్."

"జీనియస్. నువ్వు మాలో ఉండవలసిన వాడివి కాదురా (?)"

"నువ్వు బెంగాల్ దేశం వెళ్ళిపోరా ?"

"శరత్ మీకు దూరపు బంధువా ?"

అని మనిషో రకంగా అన్నారు.

ప్రారంభంలోనే ఇంత గొప్ప కథ (నవల) రాసినందుకు టీపార్టీ యివ్వాలన్నారు.

సరే, కథ ఫెయిర్ చేశాను. పంపాను. అక్కడ్నించి ఒకటే నిరీక్షణ. రోజూ పోస్టుమెన్ కోసం ఎదురుచూసేవాడిని. తీరా నా కథ అచ్చవుతే నా కివ్వడేమో, అని ముందస్తుగానే వాడిని కాస్త తడిపాను. ఎవరో చెప్పారు. ప్రచురణ విషయం తెలియడానికి రెండు నెలలు పడుతుందని.

కాని, నెలరోజులు అవగానే, ఓ మంచిరోజున పోస్ట్‌మెన్ మందంగా హసిస్తూ వచ్చి, చేతిలో ఓ కవర్ పెట్టాడు. అది నేను పంపిన పత్రిక నించి వచ్చిందని కవర్‌మీద వారి స్టాంప్‌ను బట్టి తెలిసింది. పోస్ట్‌మెన్‌కి మామూలు (?) ఇచ్చేసి పంపేసాను. ఇక కవర్ విప్పకుండా ఆలోచించ సాగాను. లోపల విషయ మేమిటా అని. తట్ట లేదు. ఇక సస్పెన్స్ భరించలేక కవర్ చింపి, లోపలి కాగితం విప్పాను.

"ఆర్యా !

మీరు పంపిన కథ అందింది. మీరు పత్రికలకి కథలు రాయడం మానేసి, సినిమాలకి కథలు రాయడం మంచిది. త్వరలోనే కీర్తీ, ధనమూ రెండూ వస్తాయి. మీ కథ సాధ్యమైనంత త్వరలో త్రిప్పి పంపగలము."

"సంపాదకుడు"

ఫలానాగారి వ్రాలు

వెంటనే మూర్ఛపోయాను. తర్వాత మెల్లిగా లేచి, గ్లాసెడు మంచినీళ్ళు తాగి తేరుకున్నాను. కొన్నాళ్లదాకా కథ రాద్దామన్న ఆలోచన అవతలకి నెట్టేశాను.

పత్రికలో వెలువడ్డ ప్రకటన చూచి, "కాబోయే కథకులకు పనికొచ్చే చిట్కాలు" తెప్పించాను. ఆరుద్రగారి కావ్యాలన్నిటినీ కంఠతా పెట్టేసాను. చిట్కాలన్నీ పట్టుపడ్డా యనిపించేక, కథ రాయడానికి కూర్చున్నాను. కాగితాలు, కలం, వక్కపొడి దగ్గర పెట్టుకున్నాను. కథ రాద్దామంటే కథావస్తువు దొరకలేదు.

"కుక్కపిల్లా
అగ్గిపుల్లా
సబ్బుబిళ్ళా
కాదేదీ కవిత కనర్హం."

అన్న శ్రీ శ్రీ వాక్యాలు గుర్తు కొచ్చాయి. కవిత కనర్హం ఏదీ కాదుకదా అని అగ్గిపుల్లమీద కథ రాద్దామనుకున్నాను. రెండు పేజీలు రాసేసాను. అంతా చదివితే కాంపోజిషన్‌లాగ అన్పించింది. వెంటనే చింపేసాను.

నా బాధ అంతా వెళ్ళబోస్తూ, ఓ ప్రఖ్యాత రచయిత (పేరు అనవసరం) కి లేఖ రాసాను. ఆయన ఒప్పిగ్గా 'నా కథ' 'కథ' అంతా చదివి ఇలా సలహా యిచ్చాడు. "మీకు మీ కథే కథావస్తువు. అదే కథగా, కథే కథగా రాయండి." వెంటనే నా కథని "నా కథ" గా రాసాను. అదే యీ కథ.

("జరగని కథ" ద్వారా "నా కథ" కు మార్గం చూపిన మిత్రులు శ్రీ "లతిక" గారికి ఈ రచన అంకితం.) ★